## ట్రంప్‌కు భయపడి యుద్ధం ఆపేసిన మోదీ

- యుద్ధంలో రాఫెల్ విమానాలు ఎన్ని కూలాయో లెక్క చెప్పాలి
- దేశానికి రాహుల్‌గాంధీ నాయకత్వం ఎంతో అవసరం
- జైహింద్ ర్యాలీలో సీఎం రేవంత్

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): దేశానికి రాహుల్‌గాంధీ నాయకత్వం అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాహుల్ ప్రధాని కావాలని, అప్పుడు దేశ ఆత్మగౌరవాన్ని నిలబెడతారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా, సైనికులకు సంఘీభావంగా ఏఐసీసీ పిలుపుమేరకు బాచుపల్లిలో గురువారం జైహింద్ యాత్ర నిర్వహించారు. అనంతరం నిజాంపేటలో నిర్వహించిన సభలో సీఎం మాట్లాడుతూ... అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులకు ప్రధాని మోదీ భయపడి నాలుగు రోజులకే యుద్ధవిరమణ చేశారని విమర్శించారు. దేశభద్రతను ట్రంప్ దగ్గర తాకట్టు పెట్టారని మండిపడ్డారు. యుద్ధం చేసే ముందు అఖిలపక్ష సమావేశం నిర్వహించిన మోదీ.. కాల్పుల విరమణకు ముందు మాత్రం అఖిలపక్షాలను సంప్రదించలేదని విమర్శించారు. యుద్ధం చేయాలని వీరతిలకం దిద్ది పంపిస్తే ఉట్టి చేతులతో తిరిగి వచ్చారని ఆరోపించారు. పీవోకేను తిరిగి స్వాధీనం చేసుకునే శక్తి బీజేపీ ప్రభుత్వానికి లేదని వ్యాఖ్యానించారు. పాక్‌తో యుద్ధంలో మన దేశానికి చెందిన రాఫెల్ యుద్ధ విమానాలు ఎన్ని కూలిపోయాయో లెక్క చెప్పాలని డిమాండ్ చేశారు. సొంత లాభం కోసం వేల కోట్ల కాంట్రాక్టులు ఇచ్చి రాఫెల్ యుద్ధ విమానాలు తీసుకొచ్చారని అన్నారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## బోరింగ్‌గా ఉన్నరు.. ఖుషీ చేస్తలేరు!

మొదటిపేజీ తరువాయి...

తెలిసింది. అయితే ఇలాంటి ఈవెంట్‌లో ఇవన్నీ సహజమేనని, నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానమివ్వడమే కాకుండా ఆమె ఆరోపణలను కొట్టిపారేసినట్టు సమాచారం. ఇక చేసేదిలేక నిస్సహాయస్థితిలో ఆమె పోటీనుంచి తప్పుకొని ఇంగ్లండ్ వెళ్లిపోయింది. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ఓ అంతర్జాతీయ అందాల పోటీలో పాల్గొనే అవకాశం దక్కించుకున్న ఆయా దేశాల కంటెస్టెంట్లు తమకు జరిగిన అవమానాలతో తప్పుకోవడం ఇష్టంలేక బలవంతంగా కొనసాగినట్టు తెలుస్తున్నది.

### చౌమహల్లాలో ఏం జరిగింది?

చౌమహల్లా ప్యాలెస్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన విందే మిల్లా మ్యాగీ పోటీ నుంచి తప్పుకొనేలా చేసింది. సుమారు 300మంది పాల్గొన్న ఆ విందులో అతిథులను అలరించడానికి వారితో ఫొటోలు దిగాలని, డ్యాన్స్‌లు చేయాలని, క్యాట్‌వాక్ చేయాలని నిర్వాహకులు పోటీదారులకు సూచించినట్టు తెలిసింది. ఇదే ఆమెను అసౌకర్యానికి గురిచేసింది. ఆమెకు ఇష్టంలేకపోయినా అతిథుల్లోని కొందరు బడాబాబులు బలవంతంగా స్టెప్పులు వేయించే ప్రయత్నం చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో తీవ్ర అసహనానికి గురైన మ్యాగీ అక్కడి నుంచి ట్రైడెంట్ హోటల్‌కు చేరుకొని ఆ రాత్రి, మరుసటి రెండు రోజులు భయంభయంగా గడిపినట్టు తెలిసింది.

### మానవత్వమున్న మిల్లా..!

మిస్‌వరల్డ్ పోటీల తీరును బట్టబయలు చేసిన మిల్లా మ్యాగీపై నిర్వాహకులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఆమె కావాలనే పోటీ నుంచి తప్పుకుని ఆరోపణలు చేస్తున్నదని కొంతమంది విష ప్రచారం చేస్తున్నారు. కానీ ఆమె సామాజిక వ్యవహారాలను పరిశీలించిన కొందరు మ్యాగీ ఎంతో నిబద్ధతగల వ్యక్తి అని కొనియాడుతున్నారు. సాధారణంగా అందాల పోటీలు అంటే సన్నగా, నాజుగ్గా ఉండాలి. కానీ కొలతలతో పనేంటి అంటూ ప్లస్ సైజ్‌తో ఉన్న ఆమె ధైర్యంగా ముందుకొచ్చి మిస్ ఇంగ్లండ్ టైటిల్ దక్కించుకున్నారు. ప్లస్‌సైజ్‌తో మిస్ ఇంగ్లండ్ టైటిల్ గెలుచుకున్న మొదటి యువతి కూడా ఆమెనే. మిల్లా మ్యాగీ సామాజిక దృక్పథం ఉన్న యువతి. గుండెపోటుతో మరణిస్తున్న వారి సంఖ్య పెరుగుతుండటంతో ఆ మరణాలను సీపీఆర్‌తో తగ్గించే అవకాశం ఉందని ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. తనకు లభించిన ప్రతి వేదికపై ఆమె సీపీఆర్ ప్రాధాన్యత.. ఆస్కిల్‌తో ఇతరుల ప్రాణాలు ఎలా కాపాడవచ్చో వివరిస్తున్నది. అందులో భాగంగా ఆమె 'గో ఫార్ విత్ సీపీఆర్' అనే కార్యక్రమాన్ని చేపట్టింది. పాఠశాల స్థాయి నుంచే సీపీఆర్‌పై సిలబస్ ఉండాలని ప్రచారం చేస్తున్నది.

### అటకెక్కిన విచారణ..!

మిస్ ఇంగ్లండ్ ఆరోపణలపై ప్రభుత్వం కమిటీ వేసిన విషయం తెలిసిందే. ఆ కమిటీ 109 మంది కంటెస్టెంట్లను, నిర్వాహకులను ప్రశ్నించినట్టు చెప్తున్నారు. కానీ ఆ కమిటీ నివేదికను ప్రభుత్వం బయటకు చెప్పడం లేదు. చౌమహల్లా ప్యాలెస్, ట్రైడెంట్ హోటల్‌లో జరిగిన కొన్ని ప్రైవేట్ కార్యక్రమాల సీసీటీజీ పుటేజీని పరిశీలిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలంగాణ ప్రతిష్ఠను దిగజార్చిన మిస్ ఇంగ్లండ్ వేధింపుల ఘటనపై సాధ్యమైనంత త్వరగా నివేదిక బయటపెట్టాల్సింది పోయి ఆ దిశగా కమిటీ అడుగులు వేయకపోవడం అనుమానాలను కలిగిస్తున్నది.

## పరారీలో ఉన్న సీఐ అరెస్ట్!

- పోక్సో కేసులో నిందితుడు

నయీంనగర్, మే 29 : పోక్సో కేసులో నిందితుడిగా ఉండి ట్రయల్స్ కోసం కోర్టుకు హాజరై సమయంలో పరారైన సీఐని పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. భూపాలపల్లిలో సైబర్ క్రైమ్ సీఐగా పని చేస్తున్న సంపత్‌పై హనుమకొండ జిల్లా కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలో నిరుడు మార్చి 22న పోక్సో నమోదైంది. సీఐని మూడు నెలలు జైలుకు పంపించారు. తరువాత బెయిల్ వచ్చింది. కోర్టులో ట్రయల్స్ జరుగుతున్న క్రమంలో మళ్లీ జైలుకు పంపిస్తారనే భయంతో కోర్టు ఆవరణ నుంచి పరారయ్యాడు. అప్పటి నుంచి కేరళ రాష్ట్రంలోని తలదాచుకున్నట్టు సమాచారంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.

# మోదీ బాటలో రేవంత్‌రెడ్డి!

- రోజురోజుకూ బలపడుతున్న బడే భాయ్.. చోటే భాయ్ బంధం
- మోదీ 'వికసిత్ భారత్ 2047' మాదిరిగా రేవంత్ 'రైజింగ్ తెలంగాణ 2047'
- 'రైజింగ్ తెలంగాణ'లో మార్పులు

హైదరాబాద్, మే 29(నమస్తే తెలంగాణ): ప్రధానమంత్రి నరేంద్రమోదీ బాటలోనే సీఎం రేవంత్‌రెడ్డి పయనిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా రేవంత్‌రెడ్డి లక్ష్యాలు కూడా మారుతున్నాయి. ఇందులో భాగంగానే 'రైజింగ్ తెలంగాణ' నినాదంలో మార్పులు చేశారు. నిన్న మొన్నటి వరకు కేవలం 'రైజింగ్ తెలంగాణ' పేరుతో ప్రచారంలో ఉన్న లోగో తాజాగా 'రైజింగ్ తెలంగాణ-2047'గా మారింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 'వికసిత్ భారత్-2047' లక్ష్యాన్ని నిర్దేశించుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మోదీ బాటలో నడుస్తున్న రేవంత్‌రెడ్డి తన 'రైజింగ్ తెలంగాణ' లక్ష్యాన్ని సైతం విజన్ 2047గా మార్చడం గమనార్హం. ఢిల్లీలో ఇటీవల జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలోనూ 'రైజింగ్ తెలంగాణ- విజన్ 2047'పై రేవంత్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనిపై సోషల్ మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి. 'బడే భాయ్' బాటలో 'చోటే భాయ్' అని కామెంట్లు చేస్తున్నారు. మోదీతో రేవంత్ సన్నిహితంగా ఉంటున్నారనే ప్రచారం చాలా కాలంగా జరుగుతున్నది. ఇప్పుడు విజన్ మార్పు ఈ బంధానికి మరింత బలం చేకూర్చిందని చెప్తున్నారు.

## సీఎంవి తుగ్లక్ విధానాలు

- తెలంగాణ రైజింగ్ నినాదం మార్చేశారు : హరీశ్‌రావు

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): ఇటీవల 'తెలంగాణ రైజింగ్' అంటూ ప్రచారం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తాజాగా 'తెలంగాణ రైజింగ్-2047' అంటూ మరో కొత్త ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఈ విధంగా రోజుకో కొత్త నినాదం, కాలానుగుణంగా కొత్త దిశ మార్చుతున్నారని, కానీ, ఏదీ కార్యరూపం దాల్చలేదని గురువారం ఎక్స్ వేదికగా దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న తుగ్లక్ తరహా విధానాలు తెలంగాణను వెనక్కి నెట్టాయని విమర్శించారు. ఇది పురోగతి కాదని, తిరోగమనం అని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ చెప్తున్న 'వికసిత్ భారత్-2047' నినాదాన్ని అనుకరిస్తూ.. త్రివర్ణ పతాకం నుంచి కాషాయరంగుకు చిహ్నంగా మారడం సందేహాలను లేవనెత్తుతున్నదని పేర్కొన్నారు.

# ప్రభుత్వాన్ని బూతులు తిడుతున్నరు!

- వడ్ల కొనుగోలు ఆలస్యంపై రైతులు తీవ్ర ఆగ్రహంగా ఉన్నరు
- మంత్రి ఉత్తమ్‌కుమార్ సమీక్షించినా పరిస్థితిలో ఎటువంటి మార్పు లేదు
- ఒక్క ఇందిరమ్మ ఇంటికి కూడా ప్రాసీడింగ్స్ ఇప్పటికీ ఇవ్వనేలేదు..
- కాంగ్రెస్ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అసహనం
- తేమ, తాలు పేరుతో రైతులను మిల్లర్లు నిలువునా దోపిడీ చేస్తున్నరు
- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తీవ్ర ఆవేదన
- మంత్రి పొంగులేటి సమీక్షలో పార్టీ ఎమ్మెల్యేల అసంతృప్తి

హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

వరంగల్, మే 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వడ్ల కొనుగోలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాన్ని అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఎండగడుతున్నారు. యాసంగి వడ్ల కొనుగోలు ఆలస్యమవుతుండటంపై అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. కొనుగోలు ప్రక్రియలో లోపాలను ఎత్తిచూపుతున్న రైతులు ప్రభుత్వాన్ని బూతులు తిడుతున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆవేదన వ్యక్తంచేశారు. వడ్ల కొనుగోలులో మిల్లర్లు దోపిడీకి పాల్పడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోళ్లు వేగంగా జరిగేందుకు, మిల్లర్ల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కోరారు. ఆరు జిల్లాల్లోని వడ్ల కొనుగోలు, ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి, వానకాలం సాగు, రాష్ట్ర అవతరణ దినోత్సవంపై మంత్రి కొండా సురేఖతో కలిసి వరంగల్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన ఈ సమావేశంలో సొంత పార్టీ ఎమ్మెల్యేల నుంచే వ్యతిరేకత వ్యక్తమైంది.

### రైతులను ఇబ్బంది పెడుతున్నరు

వడ్ల కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కలిసి రైతులను ఇబ్బంది పెడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆరోపించారు. కాంటా అయిన వడ్లకు ట్రక్ షీట్లు ఇవ్వకపోవడంతో రైతులు దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంటా అయిన రెండుమూడు రోజులకు కూడా లోడు దించుకోవడం లేదని, క్వింటాకు నాలుగైదు కిలోల కోత పెడుతున్నారని పేర్కొన్నారు. ఏ ఊరికి వెళ్లినా వడ్ల కొనుగోలు గురించే మాట్లాడుతున్నారని, రైతులు సర్కారును బూతులు తిడుతున్నారని వాపోయారు. ఇటీవల ఇక్కడికొచ్చి సమీక్షించిన పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలిచ్చినా ఎలాంటి మార్పు లేదన్నారు. కాంటాలై రోజులు గడుస్తున్నా మిల్లులు అన్‌లోడ్ చేసుకోవడం లేదని, అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గండ్ర ఆవేదన వ్యక్తంచేశారు. అలాగే, ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు తీరు కూడా బాగాలేదని విమర్శించారు. ఇప్పటి వరకు ఒక్క ఇంటి నిర్మాణానికి కూడా ప్రొసీడింగ్ ఇవ్వలేదని చెప్పారు. దీంతో జోక్యం చేసుకున్న పొంగులేటి పలుమార్లు గండ్రను వారించారు.

### తేమ, తాలు పేరుతో దోపిడీ : దొంతి

వడ్ల కొనుగోలు విషయంలో మిల్లర్లు సహకరించడం లేదని, రైతులను ఇబ్బందికి గురిచేస్తున్నారని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. కొనుగోలు కోసం పకడ్బందీ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కాంటా పూర్తయిన వడ్లకు తేమ, తాలు పేరు చెప్పి నాలుగు రోజులైనా దించకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు.

### టార్గెట్ అయిపోయిందంటున్నారు : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వడ్ల కొనుగోలు ప్రక్రియలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులను ఇబ్బంది పెడుతున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. తమ కేంద్రంలో కొనుగోలు లక్ష్యం పూర్తయిందని, కొత్తగా కాంటాలు పెట్టబోమని రైతులను మిల్లర్లు భయపెడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఇందిరమ్మ ఇండ్లలో పురోగతి లేదు : ప్రభుత్వ విప్ రామచంద్రూనాయక్

ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అధికారులు అలసత్వంతో వ్యవహరిస్తున్నారని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రూనాయక్ అన్నారు. లబ్ధిదారుల జాబితాపై త్వరగా విచారణ పూర్తి చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వానలు పడితే పనులు ముందుకు సాగవని పేర్కొన్నారు.

### లబ్ధిదారుల ఎంపికలో వయోపరిమితి లేదు : పొంగులేటి

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో వయోపరిమితి లేదని మంత్రి పొంగులేటి స్పష్టంచేశారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. లబ్ధిదారులకు ఇప్పటికీ ప్రొసీడింగ్స్ ఇవ్వకపోవడంతో కలెక్టర్లపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సీఎం రేవంత్, తాను ఇచ్చిన ఆదేశాలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. జూన్ 6లోపు లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేసి ప్రొసీడింగ్స్ ఇవ్వాలని ఆదేశించారు.

### దూరంగా సీతక్క..

ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్ష సమావేశానికి మంత్రి సీతక్క హాజరు కాలేదు. మూడునాలుగు నెలలకోసారి నిర్వహించే సమీక్షలోనూ సీతక్క పాల్గొకపోవడంపై అధికార పార్టీలో చర్చ జరుగుతున్నది. వరంగల్‌లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో, సమీక్ష సమావేశాల్లో సీతక్క పాల్గొనడంలేదు. మరో మంత్రి కొండా సురేఖతో విభేదాల కారణంగానే సీతక్క దూరంగా ఉంటున్నారని కాంగ్రెస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అలాగే, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ కూడా సమీక్ష సమావేశానికి డుమ్మా కొట్టారు.

## డిగ్రీలో 142 క్రెడిట్లు

- 7 యూనివర్సిటీల్లో కామన్ క్రెడిట్ విధానం
- యూనివర్సిటీల వీసీల సమావేశంలో ఖరారు

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో డిగ్రీ కోర్సుల క్రెడిట్లపై ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. ఇటీవలే డిగ్రీ క్రెడిట్లను 150 నుంచి 124కి తెలంగాణ ఉన్నత విద్యామండలి తగ్గించిన విషయం తెలిసిందే. తాజాగా మూడేండ్ల డిగ్రీ కోర్సులో మొత్తం క్రెడిట్లను 142గా ఖరారు చేశారు. ఈ మేరకు గురువారం మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జరిగిన 7వర్సిటీల వైస్ చాన్స్‌లర్ల సమావేశంలో డిగ్రీలో క్రెడిట్లపైనే ప్రధానంగా చర్చించారు. లాంగ్వేజ్ క్రెడిట్లను 20 నుంచి 12 క్రెడిట్లకు తగ్గించారు. దీనిపై భాషాభిమానాలు, వివిధ వర్సిటీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశాయి. ఈ నేపథ్యంలోనే ఉన్నత విద్యామండలి అన్ని వర్సిటీల వీసీలతో సంప్రదింపులు జరిపి డిగ్రీ కెడిట్లను 142గా ఖరారు చేశారు. రాష్ట్రంలోని ఏడు వర్సిటీల్లో ఈ కామన్ క్రెడిట్స్ విధానం అమలు చేయాలని నిర్ణయించారు. డిగ్రీ కోర్సుల సిలబస్‌ను 15 నుంచి 20 శాతం మేర సిలబస్‌ను మార్చాలని నిర్ణయించారు.

## సీజనల్ వ్యాధులతో అలర్ట్‌గా ఉండాలి

- డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్ సూచన

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్ గురువారం ఓ ప్రకటనలో సూచించారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యాలకు దోమలు కారణమవుతాయని.. ఇండ్ల తలుపులు, కిటికీలకు దోమతెరలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. కాచి వడపోసిన నీటిని మాత్రమే తాగాలని ఆయన కోరారు. నిల్వ ఉంచిన ఆహారాన్ని తినొద్దని పేర్కొన్నారు. గాలి ద్వారా వ్యాప్తిచెందే ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ పొందాలని.. తుమ్మినప్పుడు చేతిరుమాలు ఉపయోగించాలని కోరారు. ఎవరికైనా విపరీతమైన జ్వరం, తలనొప్పి, గొంతు నొప్పి, బాడీ పెయిన్స్ ఉంటే వెంటనే సమీపంలోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లాలని ఆయన సూచించారు.

# 'రాష్ట్ర కార్యవర్గం'పై తేల్చని కాంగ్రెస్

- ఐదు కమిటీలు ప్రకటించిన అధిష్ఠానం
- మళ్లీ ఉసూరుమనిపించిన ఢిల్లీ పెద్దలు

హైదరాబాద్, మే 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో రాష్ట్ర కార్యవర్గ ఏర్పాటు ఇప్పట్లో కొలిక్కి వచ్చేలా లేదు. రాష్ట్ర నేతలు ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం కనిపించలేదు. నేడు, రేపు అంటూ ఊరించి, చివరికి అసలు కమిటీ తప్ప మిగతావి ప్రకటించి ఉసూరుమనిపించింది. రాష్ట్రంలో రాజకీయ వ్యవహారాలు, అడ్వైజరీ, డీలిమిటేషన్, సంవిధాన్ బచావో ప్రొగ్రామ్, క్రమశిక్షణ కమిటీలను గురువారం ఏఐసీసీ ప్రకటించింది. 22 మందితో రాజకీయ వ్యవహారాలు, 15 మందితో అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ రెండింటికీ పార్టీ రాష్ట్రవ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సారథ్యం వహించనున్నారు. దీంతో పార్టీ వ్యవహారాలన్నీ ఆమె కనుసన్నల్లోనే నడువనున్నాయని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. డీలిమిటేషన్ కమిటీలో ఏడుగురు, సంవిధాన్ బచావో కమిటీలో 16 మంది, క్రమశిక్షణ కమిటీలో ఆరుగురికి చోటు కల్పించారు. రాజకీయ వ్యవహారాల కమిటీలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ ఇతర నేతలకు చోటు కల్పించారు. అడ్వైజరీ కమిటీలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సహా ఇతర కాంగ్రెస్ సీనియర్ నేతలను చేర్చారు. డీలిమిటేషన్ కమిటీ చైర్మన్‌గా చల్లా వంశీ చంద్‌రెడ్డిని నియమించగా, సంవిధాన్ బచావ్ కమిటీ చైర్మన్‌గా పీ వినయ్‌కుమార్ వ్యవహరించనున్నారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా చిన్నారెడ్డి స్థానంలో ఎంపీ మల్లు రవికి బాధ్యతలు అప్పగించారు. వైస్ చైర్మన్‌గా ఏ శ్యామ్ మోహన్, సభ్యులుగా ఎం నిరంజన్‌రెడ్డి, బీ కమలాకర్ రావు, జాఫర్ జావెద్, జీవీ రామకృష్ణలను నియమించారు. అయితే.. కీలకమైన కార్యవర్గం ప్రకటన కోసం నేతలంతా ఎదురుచూస్తుండగా, ఏఐసీసీ ఆ విషయాన్ని పక్కనబెట్టడంపై రాష్ట్ర నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టీపీసీసీకి నూతన చీఫ్ నియామకమై ఏడాది కావస్తున్నా కార్యవర్గం ఏర్పాటు చేయకపోవడంపై రగిలిపోతున్నారు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఇటీవల ఢిల్లీకి వెళ్లి వచ్చిన తర్వాత త్వరలో కార్యవర్గం ప్రకటన వస్తుందని చెప్పారని, ఆచరణలో దాని ఊసేలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎన్ని రోజులు ఎదురుచూడాలని ఆశావహులు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారట.

# రేవంత్ రాజీఅస్త్రం!

మొదటిపేజీ తరువాయి...

వచ్చినట్టేనని గుసగుసలు వినిపిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల మూడు రోజులపాటు ఢిల్లీలో ఉన్నా, మంత్రివర్గ విస్తరణకు అధిష్ఠానం నుంచి అనుమతి రాని సంగతి తెలిసిందే. పైగా రేవంత్ ఎంత ప్రయత్నించినా రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. మరోవైపు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు రెండుసార్లు రాహుల్ అపాయింట్‌మెంట్ ఇవ్వడంపైనా తీవ్ర చర్చ జరిగింది. సీఎం రూపొందించిన జాబితాను రాహుల్ గాంధీ పక్కనబెట్టారని, తాను తయారు చేసిన నలుగురి పేర్లతో కూడిన జాబితాను మహేశ్‌కుమార్ గౌడ్‌కు ఇచ్చి పంపారని కథనాలు వెలువడ్డాయి.

సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన విందులో మంత్రులు తదితరులు

### తత్వం బోధపడి.. విందు మంత్రాంగం

ఢిల్లీలో జరిగిన పరిణామాలతో సీఎం రేవంత్ రెడ్డికి తత్వం బోధపడిందని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. తన నిర్ణయాల పట్ల అధిష్ఠానం పూర్తి వ్యతిరేకతతో ఉందని సీఎంకు అర్థమైందని నేతలు చర్చించుకుంటున్నారు. మరోవైపు ఎమ్మెల్యేల విశ్వాసం కోల్పోతున్నారని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించినట్టు ప్రచారం జరుగుతున్నది. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన 9నెలల తర్వాత రేవంత్ రెడ్డి స్వయంగా తెప్పించుకున్న అంతర్గత నివేదిక ప్రకారం 64మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో 26మంది మాత్రమే ఆయనకు మద్దతుగా ఉన్నట్టు తేలిందని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ సంఖ్య ఇప్పుడు 19కి పడిపోయిందని చెప్పుకుంటున్నారు. ఇలా ఇటు రాష్ట్రంలో, అటు ఢిల్లీలో తన పరపతి దెబ్బతింటున్నదని సీఎంకు అర్థమైందని అంటున్నారు. ఏటికి ఎదురీదటం కన్నా అధిష్ఠానంతో సఖ్యత పెంచుకోవటమే ఉత్తమమనే ఆలోచనకు వచ్చినట్టు సమాచారం. అందుకే బుధవారం రాత్రి అకస్మాత్తుగా మంత్రులతోపాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలకు విందు ఇచ్చినట్టు చెప్తున్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్‌తో కలిసి సీఎం ప్రత్యేకంగా భోజనం చేశారని, అనంతరం తన రాజీ ప్రతిపాదనను ఆమె ముందు పెట్టినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. సుదర్శన్ రెడ్డి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తీవ్రంగా కృషి చేశారని, అధికారంలోకి వస్తే మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చామని గుర్తు చేసినట్టు సమాచారం. పైగా సుదర్శన్‌రెడ్డికి రాజకీయంగా ఇదే చివరి అవకాశం అని, ప్రభుత్వంలో నిజామాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం లేదని వివరించినట్టు తెలిసింది. ఓసీ కోటాలో ఆయనకు అవకాశం ఇచ్చి, మిగతా పదవులను అధిష్ఠానం ఎవరికి ఇచ్చినా తనకు అభ్యంతరం లేదని చెప్పినట్టు సమాచారం. రేవంత్ రెడ్డి ప్రతిపాదనను మీనాక్షి గురువారం ఉదయం రాహుల్‌గాంధీ దృష్టికి తీసుకెళ్లారని, ఆయన సానుకూలంగా స్పందించారని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ మొదలైంది. దీంతో 15 నెలలుగా ఊరిస్తున్న మంత్రి వర్గ విస్తరణ హైడ్రామాకు తెరపడబోతున్నదని కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి. జూన్ మొదటి వారంలో మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని చెప్పుకుంటున్నారు.

### ఒక్క దెబ్బకు మూడు పిట్టలు

సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగానే సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి కోసం పట్టుబడుతున్నారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. అధిష్ఠానం ఇచ్చిన జాబితా ప్రకారం కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డిల్లో ఒకరికి పదవి ఇవ్వాలని ప్రతిపాదించారని, వెలమ సామాజికవర్గం నుంచి ప్రేమ్ సాగర్‌రావు కూడా పోటీలో ఉన్నారని కొన్నాళ్లుగా ప్రచారం జరుగుతున్నది. ఇదే సమయంలో మంత్రివర్గ విస్తరణలో ఓసీల నుంచి ఒక్కరికి మాత్రమే అధిష్ఠానం నిబంధన విధించిందని చెప్తున్నారు. ఒకవేళ రెండో సీటు ఇవ్వాల్సి వస్తే ఓసీల్లోని ముస